క్లుప్తంగా

అన్నసంతర్పణకు నిత్యావసరాలు పంపిణీ



తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామం బాపయ్యపేటలో వేంచేసియున్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ప్రతి ఏటా ఆంజనేయస్వామి మాలధారులకు దేవస్థానం ఆధ్వర్యంలో 41 రోజుల పాటు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తారు. దీనిలో భాగంగా బీజేపీ ఆర్‌టీఐ జిల్లా కన్వీనర్ కాలిశెట్టి రమేష్‌బాబు, ఆయన మిత్ర బృందం ఆధ్వర్యంలో ఒక రోజు అన్న సంతర్పణకు అవసరమైన నిత్యావసరాలను దేవస్థాన కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు వెలివెల అనిల్, జనసేన నాయకులు తోట నరేంద్ర, బండి చంద్రమోహన్, షేక్ సలీమ్ షా, ఎం.రాఘవయ్య, పి.కోటేశ్వరరావు, నాగరాజు, పవన్‌కుమార్, వెంకటేశ్వరరావు, నరసయ్య తదితరులు ఉన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన ఏర్పరచుకోండి



తెనాలిఅర్బన్: క్షయ వ్యాధిపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పి.రవికుమార్ పేర్కొన్నారు. నందులపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో టీబీ ప్రివేన్షన్ థెరపీ పై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊపిరితిత్తుల క్షయ వ్యాధికి మందులు వాడుతున్న కుటుంబ సభ్యులకు టీబీ టెస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

4 నుంచి ఉచిత యోగ శిక్షణ శిబిరం



తెనాలిఅర్బన్: శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ ఆధ్వర్యంలో మే నెల 4వ తేదీ నుంచి చిన్న పిల్లలకు ఉచిత యోగ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు బైసాని సూర్యనారాయణ తెలిపారు. శిక్షణ శిబిరంకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం తెనాలిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగానమ్మపేటలోని చుండూరు వారి సత్రంలో ప్రతిరోజు ఉదయం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు యోగ శిక్షణ శిబిరం జరుగుతుందని చెప్పారు. వారం రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని చిన్నారులు ఉపయోగించుకోవాలని కోరారు.

ఈతకు వెళ్లి.. మృతుడయ్యాడు!

తెనాలిరూరల్: పట్టణ చెంచుపేటకు చెందిన ప్రసాద్ (23) మండలంలోని సంగంజాగర్లమూడి గ్రామంలో కొమ్మమూరు కాల్వలో ఈతకు దిగి సోమవారం గల్లంతయ్యాడు. మృతదేహాన్ని పోలీసులు మంగళవారం గుర్తించి తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. బుధవారం పోస్టుమార్టం నిర్వహించనున్నట్టు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

మున్సిపాలిటీ మేనేజరుగా జయకర్



తెనాలి: పట్టణ మున్సిపాలిటీ మేనేజరుగా కేడబ్ల్యు జయకర్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. తణుకు మున్సిపాలిటీలో కేడర్-2 మేనేజరుగా పనిచేస్తున్న జయకర్‌ను పదోన్నతిపై కేడర్-1 మేనేజరుగా నియమించారు. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. గతంలో వీరు తెనాలి మున్సిపాలిటీలో రెవెన్యూ అధికారిగా బాధ్యతుల నిర్వర్తించారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

నగరం: వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రిపాలెం గ్రంథాలయ శాఖ నిర్వాహకుడు బహ్మేంద్ర తెలిపారు. మండలంలోని మంత్రిపాలెం గ్రంథాలయంలో జరుగుతున్న విజ్ఞాన శిబిరాలను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వేసవి సెలవులలో విద్యార్థులకు పుస్తక పఠనం, సమీక్ష, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణనిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని గ్రంథాలయం పరిధిలోని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

కదలని ఇంజనీరింగ్

- పెండింగ్‌లో 100 అభివృద్ధి పనుల బిల్లులు
- మరో 40 సీ బిల్లులు పెండింగ్
- ఆందోళనకు సిద్ధమవుతున్న కాంట్రాక్టర్లు
- మార్పురాకపోతే 15 నుంచి పనులు నిలిపివేస్తామంటూ వెల్లడి



చైర్‌పర్సన్ రాధికకు వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టర్లు

తెనాలిఅర్బన్: పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగం పనితీరు మెరుగుపడటం లేదు. కౌన్సిలర్‌లు ఎన్నిసార్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో నిలదీసినా అధికారుల్లో మార్పు రావడం లేదు. దీంతో పట్టణంలోని కాంట్రాక్టర్‌లు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు తయారు చేసి అప్‌లోడ్ చేయించాలని లేని పక్షంలో మే 15 నుంచి పట్టణంలో పూర్తిగా అభివృద్ధి పనులు నిలిపివేయటంతో పాటు టెండర్లు బహిష్కరిస్తామని హెచ్చరికలు జారీ చేశారు.

అభివృద్ధి పనులు జరిగే విధానం ఇది

తెనాలిలో అభివృద్ధి పనులు చేయాలని ప్రజాప్రతినిధులు, కమిషనర్ సూచించిన పనులకు సంబంధించిన ఎస్టిమేషన్‌లు ఏఈలు వేస్తారు. అనంతరం వాటిని ఆన్‌లైన్‌లో టెండర్లు పిలుస్తారు. తెనాలిలో ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్న 23 కాంట్రాక్టర్‌లలో కొంత మంది వాటిలో పాల్గొంటారు. అనంతరం తక్కువ అమౌంట్ కోడ్ చేసిన వారికి మున్సిపల్ కౌన్సిల్ అనుమతితో వర్కు అర్డర్ ఇస్తారు. కాంట్రాక్టర్ ప్రారంభించిన పనులను వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు పర్యవేక్షిస్తారు. అలాగే ఏఈ, డీఈ, ఎంఈలు అప్పుడప్పుడు వచ్చి పనులు పర్యవేక్షిస్తారు. వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు ఎంబుక్ తయారు చేసి ఏఈకి పంపుతారు. అక్కడి నుంచి డీఈ, ఎంఈ నుంచి కమిషనర్‌కు వెళ్తాయి. అక్కడి నుంచి జేటీవో వెరిఫికేషన్ తర్వాత ఏఏవోకు బిల్లులు వెళ్తుంది. అక్కడి నుంచి గుంటూరులోని ఫ్రీ ఆడిట్‌కు వెళ్తుంది. అక్కడి నుంచి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌కు వచ్చింది. అక్కడి నుంచి కమిషనర్ సీఎంఎఫ్‌ఎస్‌కు సంబంధించిన వేలి ముద్ర వేస్తాడు. ఇది రూ.అయిదు లక్షలలోపు బిల్లు అయితే, అంతకు మించి అయితే మరోసారి ఏఈ నుంచి ఎంఈ వరకు వేలిముద్రల కోసం బిల్లు వెళ్లాల్సి ఉంటుంది.

తెనాలి పట్టణం 16.77 కిలో మీటర్ల విస్తీర్ణం ఉంది. ఇందులో 55,917 నివాస గృహాలున్నాయి. 2.60 లక్షల జనాభాతో ఉమ్మడి జిల్లాలో అతి పెద్ద పట్టణంగా తెనాలి విస్తరించింది. జిల్లాలోనే ఏకైక సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా దీనికి పేరుంది. ప్రతి ఏడాది వివిధ పన్నులు, షాపు రూంల అద్దెలు వంటి వాటి ద్వారా రూ.36 కోట్ల ఆదాయం సమకూరుతుంది. ఇవికాకుండా 15వ ఆర్థిక సంఘం, ఇతర గ్రాంట్‌ల ద్వారా సుమారు రూ.50 కోట్ల వరకు సమకూరుతుంటాయి.

16.77 కిలోమీటర్ల పరిధి..


నిలచిన 140 అభివృద్ధి పనుల బిల్లులు

తెనాలి పట్టణంలో గతేడాది గడప గడపకు మన ప్రభుత్వం పనులు, 14వ ఆర్థిక సంఘం, 15వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్ నిధులతో అనేక అభివృద్ధి పనులు జరిగాయి. వాటిలో కొన్నింటిని అధికారులు బిల్లులు రూపొందించి ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేశారు. మిగిలిన పనులు పూర్తి అయిన నేటికి వాటి బిల్లులను ఏఈలు రూపొందించ లేదు. దీంతో పట్టణంలో సుమారు 100 అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు కాంట్రాక్టర్లు మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికకు తెలియజేసి వినతి పత్రం ఇచ్చారు. ఇవి కాకుండా రక్షిత మంచినీటి పథకం పైప్‌లైన్‌లు రిపేరు, ఎలక్ట్రికల్, శానిటేషన్ వంటి అత్యవసర పనులను ఇంజనీరింగ్ అధికారులు ముందు చేయిస్తారు. వాటిని ఎం బుక్ రికార్డు చేయకుండా సీ బిల్లుల కింద పెట్టి మంజూరు చేయిస్తారు. ఇలాంటివి పట్టణంలో 40 బి ల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు కాంట్రాక్టర్లు తెలిపారు.

ఆందోళన బాటలో కాంట్రాక్టర్లు

తెనాలిలో సుమారు ఏడాది నుంచి అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయని కాంట్రాక్టర్‌లు పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఫిబ్రవరి నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య ఇంజనీరింగ్ అధికారులను నిలదీశారు. అయిన మార్పు రాకపోవటంతో మంగళవారం చెంచుపేటలో కాంట్రాక్టర్‌లు ప్రత్యేక సమావేశం నిర్వహించుకున్నారు.

అనంతరం వారు మున్సిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికను కలిసి తమ సమస్యలు తెలియజేశారు. 15 రోజుల్లో సమస్య పరిష్కరించాలని లేని పక్షంలో మే 15 నుంచి పట్టణంలో అభివృద్ధి పనులు నిలిపివేస్తామని హెచ్చరించారు. అలాగే టెండర్లను కూడా బహిష్కరిస్తామని తెలిపారు. గతంలో గుంటూరు నుంచి ఫ్రీ ఆడిట్ అధికారులు తెనాలి వచ్చి బిల్లులు చెక్ చేసేవారని ఏడాది నుంచి బిల్లులనే గుంటూరు పంపుతున్నారని చెప్పారు. గతంలో వలే ఫ్రీ ఆడిట్ తెనాలిలో జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ఇంజనీరింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేయటంతో పాటు కాంట్రాక్టర్‌ల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



కాంట్రాక్టర్లు ఇచ్చిన వినతిపత్రం

నిబంధనల మేరకు బిల్లులు ఆమోదిస్తాం



ప్రభుత్వం ఇటీవల జీవో నెం.75ను జారీ చేసింది. దాని ప్రకారం పట్టణంలో అభివృద్ధి పనులు చేసిన వారి బిల్లులను ఆమోదించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అలాగే పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులు త్వరగా రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించాం. కాంట్రాక్ట్‌లకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం.

–బండి శేషన్న, కమిషనర్, తెనాలి పురపాలక సంఘం.

అర్బన్ మార్కెట్ సేవలు ఉపయోగించుకోండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: మెప్మా విభాగం ఆధ్వర్యంలో తెనాలి పట్టణంలో ప్రతి నెల 4వ సోమ, మంగళవారాల్లో ఏర్పాటు చేస్తున్న అర్బన్ మార్కెట్ సేవలను ప్రజలందరూ ఉపయోగించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. మున్సిపల్ మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు దీనిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

సహకరించే వారు ఏరీ?



తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలను ఎంఎన్‌వోల కొరత వేధిస్తోంది. వైద్యశాలకు వచ్చిన నడవలేని స్థితిలో ఉన్న రోగులను స్ట్రెక్చర్‌పై తీసుకు వెళ్ళేవారు కరువయ్యారు. కుటుంబ సభ్యులే స్ట్రక్చర్ తెచ్చుకుని వైద్యుల వద్దకు తీసుకువెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి రోగులకు మెరుగైన వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.

ఉపాధి హామీ పనికి దరఖాస్తు చేసుకోవాలి

ఎంపీడీవో అత్తోట దీప్తి



తెనాలిటౌన్: ఉపాధి హామీ పనికి దరఖాస్తు చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి అత్తోట దీప్తి సూచించారు. మంగళవారం ఆమె కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్ఆర్‌జీఎస్ పథకం కింద మండల పరిధిలో నాలుగు వేల మందికి ఉపాధి కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలియజేశారు. అయితే ప్రస్తుతం 1500 మందికి మాత్రమే పని కల్పించినట్లు చెప్పారు. అంగలకుదురు, నందివెలుగు, హాఫ్‌పేట, కొలకలూరు, పెదరావూరు గ్రామాల్లో కాల్వలోకి నీరు చేరడం వలన పని కల్పించలేకపోయినట్లు తెలియజేశారు. మేజర్‌మెంట్స్‌కు అనుగుణంగా రోజుకు కనీసం రూ.307లు పనికి వేతనంగా ఇస్తున్నట్లు చెప్పారు. జాబ్‌కార్డు లేకపోతే దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. హౌసింగ్ స్కీం కింద ఇల్లు మంజూరయే గతంలో కట్టుకులేని వారికి ప్రస్తుతం అదనంగా నగదు మంజూరైనట్లు తెలిపారు. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ఇస్తున్నట్లు వివరించారు. మండల పరిధిలో 548 మందికి కేటాయింపులు రాగా 158 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించినట్లు చెప్పారు. జూన్ 18న పూర్తి నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. కొలకలూరు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని యుద్ధప్రాతిపదికన గ్రామంలో ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేస్తున్నట్లు వివరించారు.

చిరువ్యాపారిపై మున్సిపల్ ఉద్యోగుల కర్కశం

- హోటల్ సామాను తీసుకెళ్లేందుకు ప్రయత్నం
- కిరోసిన్ పోసుకోవటంతో తాత్కాలికంగా విరమణ

తెనాలి: రోడ్లు ఆక్రమించుకుని యథేచ్ఛగా వ్యాపార దుకాణాలను నిర్వహిస్తున్న ఎందరినో వదిలేసిన మున్సిపల్ పాలకులు దశాబ్దాలుగా హోటల్ నడుపుకుంటున్న చిరువ్యాపారిపై పడ్డారు. ఆయన జీవనోపాధిని దెబ్బతీసేందుకు ప్రయత్నించారు. ఉపాధి కోల్పోతే తనకు మరణమే శరణ్యమన్న నిర్వేదంతో ఆ చిరువ్యాపారి కిరోసిన్ పోసుకోవటంతో తాత్కాలికంగా ఆగారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణ కొత్తపేటలోని మండల తహసీల్దార్ కార్యాలయం ఉత్తరంపైపు ప్రహరీ వద్ద చిన్న హోటల్ ఎప్పటి నుంచో నడుస్తోంది. మువ్వల శ్రీరామమూర్తి, నాగమల్లేశ్వరి దంపతులు ఆ హోటల్‌ను నడుపుకుంటున్నారు. నాలుగున్నర దశాబ్దాల క్రితం శ్రీరామమూర్తికి అక్కడ హోటల్ నడుపుకునేందుకు అనుమతినిచ్చారని చెబుతున్నారు. మున్సిపాలిటీకి చట్టబద్ధంగా పన్నులు చెల్లిస్తూ అధికారంగా ఆ హోటల్ కొనసాగుతోంది. ప్రస్తుతం ఆ స్థలం రెవెన్యూ అసోసియేషన్‌కు వెళ్లింది. అక్కడ అసోసియేషన్ కార్యాలయం కోసం నిర్మాణం చేస్తామని, అక్కడ నిర్మించే కాంప్లెక్సులో హోటల్‌కు అనుమతిస్తామని హోటల్ నిర్వాహకులకు చెప్పారు. అప్పటి వరకు తమ సంగతేంటన్న ప్రశ్నకు సమీపంలోని బాలుర హైస్కూలు గోడ పక్కన తాత్కాలికంగా నిర్వహించుకోవాలని అధికారులు సూచించారు. ఆ ప్రకారం హోటల్‌ను ఏర్పాటు చేసుకుంటున్న క్రమంలో మంగళవారం వెంకట్రామయ్య అనే మున్సిపల్ ఉద్యోగి, సిబ్బందితో సహా వచ్చి సామాన్లు వాహనంపైకి ఎక్కించారు. దీంతో జీవనోపాధి పోతుందన్న నిరాశతో శ్రీరామమూర్తి వంటిపై కిరోసిన్ పోసుకోవటంతో సామాన్లు వదిలేసి వెళ్లారు. కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయి తమకు షాపు కేటాయించేవరకు హోటల్ నిర్వహణకు అనుమతించాలని ఆ దంపతులు ప్రాధేయపడుతున్నారు.

కార్మికుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్న కేంద్రం



సమావేశంలో పాల్గొన్న పలు కార్మిక సంఘాల నాయకులు

మంగళగిరి టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని సి.ఐ.టి.యు కార్యాలయంలో మంగళవారం పలు కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ, సీఐటీయూసీ, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు హాజరయ్యి మాట్లాడారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతులకు నష్టం కలిగించే మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చిందన్నారు. దీనికి వ్యతిరేకంగా రైతులు ప్రాణాలు అర్పించి రద్దు చేయించారని గుర్తు చేశారు.

అయినప్పటికీ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వర్గాలు పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసిందని విమర్శించారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న మోడీ ప్రభుత్వానికి సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. మే 17వ తేదీన బైక్ ర్యాలీ నిర్వహించాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఎస్.నాగరాజు, డి.అమరేశ్వరరావు, రత్నాకం శ్రీనివాసరాజు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ నాయకుల బుచ్చిబాజు, శ్రీనివాసులు, సీఐటీయూ నాయకులు బాలాజీ, చెంగయ్య, ఏఐటీయూసీ నాయకులు ప్రభాకర్, వివిధ కార్మిక సంఘాలనాయకులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో వసతులు కల్పించాలి

రేపల్లె: పని ప్రదేశంలో కార్మికులకు యజమానులు కనీస సౌకర్యాలు కల్పించాలని కార్మిక శాఖ అధికారి ప్రభాకర్‌రావు చెప్పారు. పట్టణంలో పలు ప్రాంతాలను మంగళవారం ఆయన సందర్శించి భవన నిర్మాణ కార్మికులు, యజమానులతో మాట్లాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని కార్మికుల కోసం పని ప్రదేశంలో తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఎండ వేడిమి అధికంగా ఉంటున్నందున మధ్యాహ్న భోజన విరామ సమయంలో రెండు గంటలు కార్మికులకు విశ్రాంతిని ఇవ్వాలన్నారు. కార్మికుల భద్రతకు చర్యలు చేపట్టని యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్మికులకు ఎటువంటి అపాయం సంభవించిన యజమానులే బాధ్యత వహించాలన్నారు. అదే విధంగా వ్యాపార సముదాయాలు, హోటల్స్‌లో పనిచేసే కార్మికులకు కనీస వసతులు కల్పించాలని కోరారు.

ప్రధాని సభకు తెనాలి శిల్పాలు



తెనాలి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే నెల 2వ తేదీన అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవం కోసం రానున్న సందర్భంగా బహిరంగసభా వేదిక వద్ద ప్రదర్శించేందుకు అమరావతి అక్షరాలతో కూడిన భారీ ఫెడస్టల్ని తెనాలి శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర తీర్చిదిద్దారు. ఇనుప వ్యర్థాలతో చేసిన పెడస్టల్‌కు అమరావతి అక్షరాలను ఐరన్ స్క్రాప్‌తో రూపొందించారు. ఒకవైపు గౌతమబుద్ధుడి ఐరన్ స్క్రాప్ విగ్రహం, ఆ పక్కనే నరేంద్రమోదీ ఫైబర్‌గ్లాస్ విగ్రహం, స్టెయిన్‌లెస్ స్టీల్‌తో చేసిన మేకిన్ ఇండియా సింహం విగ్రహాన్ని రూపొందించారు. మరో వైపు ఎన్టీఆర్ ఐరన్ స్క్రాప్ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ఉంచిన పెడస్టల్, విగ్రహాలను కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి మంగళవారం సందర్శించారు. ప్రధానమంత్రి బహిరంగ సభావేదిక వద్ద వీటిని ప్రదర్శించేందుకు సృజనాత్మకత, సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మల్లికార్జునరావు సహకరించినట్టు శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు చెప్పారు.

రెండో రోజుకు చేరిన ఆర్టీసీ కార్మికుల రిలే దీక్ష



రేపల్లె: సమస్యల సాధన కోసం నేషనల్ మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు రేపల్లె ఆర్టీసీ డిపోలో కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరింది. కార్మికులకు పదోన్నతులు కల్పించాలని, పని ఒత్తిడి తగ్గించాలని, డిపోలో సమస్యలను పరిష్కరించాలని రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎన్ఎంయూ జిల్లా సంయుక్త కార్యదర్శి వీఎస్ వాసు తెలిపారు. దీక్షలో జి.శివప్రసాద్, జీవీ రాఘవయ్య, బి.శ్రీనివాసరావు, ఐలవరం బాలకృష్ణ, శ్యామ్ బాబు పాల్గొన్నారు.

ఘనంగా భవనం వెంకటరెడ్డి అంతిమయాత్ర



అంతిమయాత్రలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ బిల్డర్, వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు భవనం వెంకటరెడ్డి అంతిమయాత్ర మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందిన విషయం తెలిసిందే. ఏకైక కుమార్తె వివాహం ఈనెల 9న జరగాల్సి వుండగా ఈలోగానే వెంకటరెడ్డి మృతిచెందటం ఆ కుటుంబంలో పెనువిషాదాన్ని నింపింది. మంచితనం మూర్తీభవించిన వెంకటరెడ్డి అంతిమయాత్ర గంగానమ్మపేటలోని భవనం వారి వీధి నుండి ఉదయం ప్రారంభమైంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తన ఆప్తమిత్రుడి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన సోదరుడు, టీడీపీకి చెందిన అన్నాబత్తుని శ్రావణ్‌కుమార్ కూడా హాజరై నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్లస్టర్ అధ్యక్షులు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు గోల్డ్ రహీమా, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు ఆరిగ చంద్రారెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, కల్లం వెంకటప్పారెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, గెడ్డటి సురేంద్ర, బొమ్ము నాగిరెడ్డి, బూరెల దుర్గాప్రసాద్, ఉయ్యూరు సంజీవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, చినబాలకోటిరెడ్డి, జలగం రామకృష్ణ, కాళిదాసు సత్యం, మల్లెబోయిన రాము, తట్టుకూళ్ల అశోక్‌యాదవ్, మల్లెబోయిన రాము, కోలా వాసు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

హనుమత్ శోభాయాత్రను జయప్రదం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

రేపల్లె: హనుమత్ జయంతిని పురస్కరించుకొని చైతన్య వేదిక, సమరసత సేవా ఫౌండేషన్, విశ్వ హిందూ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో మే 18వ తేదీన నిజంపట్నం మండలం గరువుపాలెం హనుమాన్ విగ్రహం నుంచి నగరం హనుమాన్ దేవాలయం వరకు జరుగు శోభాయాత్రని జయప్రదం చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ కోరారు. మండలంలోని పోట మెరక వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్ర కరపత్రాలను విడుదల చేసి గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువుల ఐక్యతను చాటి చెప్పేలా 18వ తేదీన జరిగే శోభాయాత్రలో ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు గరువుపాలెం నుంచి ప్రారంభమయ్యే శోభాయాత్ర నగరం హనుమాన్ ఆలయం వరకు సాగుతుందన్నారు. శోభాయాత్రలో హిందూ పరిషత్ రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారని తెలియజేశారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారకులు జంజనం హేమ శంకరరావు, మహేష్, వీర రాఘవయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన పంటలు



మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాణిశ్రీ

నగరం: ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల ఆరోగ్యవంతమైన పంటలు పండించవచ్చని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.వాణిశ్రీ చెప్పారు. మండలంలోని పూడివాడ గ్రామంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన అవగాహన సదస్సులో వాణిశ్రీ పాల్గొని మాట్లాడారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. ఈ విధానం వల్ల నేల సారవంతంతో పాటు పంటలు ఆరోగ్యవంతంగా ఉంటాయన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా వ్యవసాయ శాఖ సిబ్బంది కృషి చేయాలని కోరారు. రేపల్లె ఏడీఏ ఆర్.విజయబాబు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలు, రసాయనిక ఎరువుల వల్ల కలిగే దుష్పరిణామాలపై వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏవో రమేష్‌బాబు, ఏపీఎం కృపాసాగర్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు

రేపల్లె: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, బాపట్ల ఆధ్వర్యంలో ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో పలు కోర్సులలో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సి.రవి చంద్రకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ అభ్యర్థులకు స్కిల్ హబ్ సెంటర్‌లో పరిశ్రమలకు అనుగుణంగా శిక్షణ అందించి, అనంతరం అభ్యర్థులకు జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థల నుంచి సర్టిఫికెట్ అందించబడునన్నారు. అర్హతలను బట్టి అభ్యర్థులకు ఆయా కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించబడునని తెలియజేశారు. శిక్షణకు 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి, ఇంటర్, ఏదైనా డిగ్రీ ఆ పైన చదివిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెబ్ డెవలపర్, అకౌంట్స్ అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9347468946ను సంప్రదించాలన్నారు.